బాధ్యతతో సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్


ప్రజల వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్‌లతో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మొత్తం 240 అర్జీలు అందగా శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖ 191, ఆర్‌జెడి కడప 1, పోలీస్ శాఖ 11, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ 2, జిల్లా పంచాయతీ 2, వ్యవసాయశాఖ 3, జిల్లా ఫారెస్ట్ శాఖ 1, జిల్లా విద్యాశాఖ 1, డిఆర్‌డిఏ 5, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 1, మైన్స్ అండ్ జియాలజీ 1, నేషనల్ హైవే 1, బిసి వెల్ఫేర్ 1, సీపీఓ 1, కోఆర్పేషన్ కో ఆపరేటివ్ సొసైటీ 1, సోషల్ వెల్ఫేర్ 1, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ 3, పలమనేరు మున్సిపల్ కమిషనర్ 1, ఎంపిడిఓ వెదురు కుప్పం 1, ఎంపిడిఓ ఎస్ఆర్ పురం 1, ఎల్‌డిఎం 2, ఎపిఎస్ ఆర్‌టిసి 1, ఎపిఎస్‌పిడిసిఎల్ 1, వాటర్ రిసోర్స్ 1, ట్రైబల్ వెల్ఫేర్ 1, స్కిల్ డెవలప్మెంట్ 1, హౌసింగ్ 3, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డిఆర్ఓ, డ్వామా పీడీలకు అందజేశారు.


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పిని, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 31 ఫిర్యాదులు అందగా చీటింగ్ 5, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 4, ఇంటి తగాదాలు 2, డబ్బు తగాదాలు 8, భూ తగాదాలు 7 ఉన్నాయి.

శనగ రైతును ఆదుకోండయ్యా..

వర్షాభావ పరిస్థితుల్లో వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయి నిలువునా మునిగిపోయిన రైతులను ఆదుకోవాలంటూ శాంతియుత రైతు ఉద్యమనేత ఈదెల వెంకటాచలం నాయుడు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎండిన వేరుశనగతో నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్‌కు వినతి చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో పూర్తిగా వేరుశనగ ఎండిపోయిందని ప్రభుత్వం వేరుశనగ రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి నెలకొందన్నారు.

వేగంగా పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) ద్వారా ప్రజలు అందించే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో భాగంగా అందే వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం 3, ఇంజనీరింగ్ 3, రెవెన్యూ 1 చొప్పున మొత్తం ఏడు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ గోమతి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, అధికారులు పాల్గొన్నారు.

వంక ఆక్రమణలు తొలగించాలని వినతి

వెదురుకుప్పం : మండలం మాంబేడు గ్రామంలో కొంతమంది రైతులు వంక పరంబోకును ఆక్రమించుకున్నారని సామినేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీ ద్వారా సమస్యను కలెక్టర్ తెలియజేశారు. ఈ వంక దారి ద్వారా సుమారుగా 50 ఎకరాలకు 200 మంది రైతులు వెళ్లాల్సి ఉండగా కొందరు రైతులు వంక పోరంబోకు దారిని ఆక్రమించి కంచె వేశారని, వాటిని తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపినట్లు తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టండి..

బంగారుపాళ్యం: గ్రామంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలని బొమ్మాయిపల్లి పంచాయతీ వజ్రాలపుర గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచ్ నీరజాక్షులు గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఇల్లులేని నిరుపేదలు ఉన్నారని వారికి గృహకల్ప కార్యక్రమం ద్వారా ఇండ్లు మంజూరు చేయాలని, బొమ్మాయిపల్లి నుండి వజ్రాలపురం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నదని గ్రామస్తులు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందని గ్రామంలోనే నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఉప సర్పంచ్ గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు

ఎండిన వేరుశనగతో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటాచలం నాయుడు

హంద్రీ నీవాకు పూర్వ వైభవం తెస్తాం

గత ప్రభుత్వ హయాంలో విస్మరించారు : మంత్రి నిమ్మల రామానాయుడు

హంద్రీ నీవా కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి- పెద్దపంజాణి: హంద్రీ- నీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా హంద్రీ నీవా కాలువను పూర్తిస్థాయిలో నిర్మించి ప్రజలకు తాగు సాగు నీటిని అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం మండలంలోని అప్పినపల్లి సమీపంలో కుప్పం బ్రాంచ్ కెనాల్ టేక్ ఆఫ్ పాయింట్‌ను స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. హెచ్.ఎస్.ఎస్.ఎస్ ఎస్ఈ రాజగోపాల్ కెనాల్ పనులను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హంద్రీ నీవా దుస్థితికి కారణం వైసీపీ ప్రభుత్వమే అని, 5 శాతం పనులు కూడా పూర్తి చేయకుండానే వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం పాలన సాగిచ్చిందని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రిపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అభిమానాన్ని నిలబెట్టుకుంటామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. 2014లో రాష్ట్ర విభజనకన్నా 2019- 24లో వైఎస్ జగన్ పాలన వల్లే రాష్ట్రానికి ఎక్కువ ఆర్థిక నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మనోజ్ రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై మంత్రికి వినతి

రామకుప్పం: రాష్ట్ర జన వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రామకుప్పం టిడిపి నేతలు, కార్యకర్తలు చెల్లిగానిపల్లిలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు పూలమాలలు వేసి దృశ్యాలవాలు కప్పి స్వాగతం పలికి మండలంలోని వివిధ సమస్యలపై వినతులు అందించారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రతి ఒక్క అంశాన్ని పరిశీలించి అభివృద్ధి దిశగా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర నేత మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, చిన్నకృష్ణ, రామ్మూర్తి, కృష్ణ నాయక్, నాగభూషణం, రఫీ, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంటౌన్: వెంకట్రామయ్య చెరువుకు విముక్తి కలిగేనా అంటూ పాత్రికేయ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడును విలేకరులు ప్రశ్నించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక రహదారులు భవనాలశాఖ అతిథి గృహంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిజర్వాయర్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, వీలైనంత త్వరలో కుప్పంకు హంద్రీనీవా జలాలు తీసుకు రావడం జరుగుతుందన్నారు. అనంతరం పాత్రికేయులు స్పందిస్తూ కుప్పం పట్టణంలోని కోట్ల రూపాయల విలువచేసే వెంకట్రామయ్య చెరువు దురాక్రమణకు గురి అయిందని, ఈ దురాక్రమలను గుర్తించిన అధికారులు సుమారు దశాబ్ద కాలం నాడే చెరువు ఆక్రమణను తొలగించాలంటూ స్థానిక అధికారులను ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి దురాక్రమణకు గురి అయిన చెరువులను ప్రభుత్వం స్వాధీన పరుచుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు.

బైరెడ్డిపల్లి: పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లి వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్ రెండవ దశ పనులను పరిశీలించిన మంత్రి అనంతరం బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించారు. కైగల్ జలపాతాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కలిసి మంత్రి పరిశీలించారు. కైగల్ రిజర్వాయర్‌కు గతంలో నిధులు మంజూరు చేసిన పనులు జరగలేదని, టిడిపి ప్రభుత్వ హయంలో రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు.

సోమల: మండలం ఆవులపల్లె వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించ తలపెట్టిన అతిపెద్ద రిజర్వాయర్ కారణంగా భూములు కోల్పోతున్న రైతులు మంత్రి నిమ్మల రామానాయుడును కురబలకోట మండలంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వాయర్ కారణంగా భూములు కోల్పోతున్నామని, రిజర్వాయర్ నిర్మాణాన్ని ఆపించి తిరిగి సీతమ్మచెరువు కట్ట నిర్మాణం చేపట్టి రైతులకు చెరువు నీటి ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ పూర్తిస్థాయిలో పరిశీలించి సీతమ్మచెరువు కట్ట నిర్మాణం జరిగే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- అడ్డుకున్న గ్రామస్తులపై దాడులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పలమనేరు

ట్రాక్టర్ల ద్వారా నదిలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

మండలం సమీపంలో ఉన్న నాగమంగళం కౌండిన్య నదిలో కొందరు యథేచ్ఛగా ఇసుకను ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం ఉదయం ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులో వారు దౌర్జన్యానికి దిగారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు కౌండిన్య నదిలోని ఇసుకను అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా వక్ఫ్‌బోర్డు భూములు ఉన్నాయని, చుట్టపక్కల ఇసుక తవ్వకాలు జరపొద్దని గ్రామస్తులు చెబుతున్నా వారు ఏమాత్రం పట్టించుకోకుండా ఇసుకను తరలిస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నదిలో ఇసుకన తరలించడం వలన భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని ఇకనైనా కలెక్టర్, ఎస్పీ, అధికారులు తమ సమస్యను పట్టించుకుని నదిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించుటకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో ఎస్పీ మణికంఠ చందోలు, డిటిసి నిరంజన్‌రెడ్డితో కలసి జిల్లా రోడ్డుభద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించుటకు జిల్లా రోడ్డు భద్రత కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2024 జనవరి నుండి సెప్టెంబర్ 20 తేదీ వరకు 119 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, అందులో 64 మంది మరణించడం, 211 మందికి గాయాల భారినపడడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జిల్లాలోని సంబంధిత శాఖలు అన్ని సమిష్టిగా పనిచేయాలన్నారు. జిల్లాలో 69 నెంబర్ జాతీయ రహదారి 84 కిలోమీటర్లు పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరిగే 11 (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాలని గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. తరుచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతంలో రోడ్డు భద్రత నియమాలను వాయిస్ రికార్డింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో అన్నిచోట్ల లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. పత్తికొండ, గంగవరం, బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిహెచ్‌సిల పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురైన క్షేత్రగాత్రులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు అవసరమైన బ్లడ్‌ను, అంబులెన్స్ అందుబాటులో ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని, రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎం అండ్‌హెచ్‌ఓ, డిసి హెచ్ఎస్‌ను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ అతి వేగమే ప్రమాదాలకు కారణమని, మలుపులను ముందుగానే గుర్తించి, ఓవర్ టేక్ చేసే సమయంలో వేగం తగ్గించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను తప్పక పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ఆర్‌టిఓ సునీల్ కుమార్, ఎన్‌హెచ్‌పిడి వెంకటేశ్వర్లు, కార్తీక్ రెడ్డి, పిఆర్, ఆర్ అండ్ బిఎస్ఈలు చంద్ర శేఖర్‌రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, డిపిఓ లక్ష్మి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, మున్సిపల్ కమిషనర్లు డిఆర్ఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు 'ఆరోగ్య సురక్ష'

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని వారు బాగుంటేనే మనమందరం బాగుంటామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ఏరియా ఆసుపత్రిలో చేపట్టిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సురక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని, అలాంటి వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రైవేటు వైద్యులు సైతం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు కార్మికుల సేవలను కొనియాడారు. అనంతరం ఆసుపత్రిలోని మెటర్నిటీ, ఎన్‌బీఎస్‌యూ యూనిట్, ఓపి వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతా రాణి, ఆర్ఎంవో శారదమ్మ, బాలాజీ, కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్‌వి. బాలాజీ, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడు, నాగరాజు, ఖాజా, చాంద్‌బాషా, మౌలా సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల కొరకు ఏర్పాటు చేసిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సురక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారు ఆరోగ్యంగా ఉంటే ప్రజలూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్మికులను కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరంటెండెంట్ అరుణ్ కుమార్ ఆస్పత్రిలో నీటి ఎద్దడిని ప్రస్తావించగా సత్వరమే బోరు వేసి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

కార్వేటినగరం: కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన సలహాలు ఇవ్వడం, వైద్యం అందించడమే ప్రధాన ఉద్యేశమని రామిశెట్టి రాజశేఖర్ తెలిపారు. వైద్యాధికారులు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ కీర్తి, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సత్యవాణి పాల్గొన్నారు.

అవినీతి వెలుగు చూస్తుందన్న భయంతో ఉద్యోగులపై దాడి

సహకార శాఖ అధికారి దాష్టీకం

ప్రజాశక్తి- శాంతిపురం: సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులలో భాగంగా శాంతిపురం సంఘంలో విధులు నిర్వహించడానికి వచ్చిన సీనియర్ ఇన్స్పెక్టర్ రజనీపై స్థానిక సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ దాడులకు పాల్పడ్డట్టు ఆలస్యంగా తెలిసింది. స్థానికుల కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శాంతిపురం ప్రాథమిక వ్యవసాయ కేంద్రలో విధి నిర్వహణకు వచ్చిన ఉద్యోగిపై స్థానిక సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ దాడి చేసి గాయపరిచారు. ప్రాథమిక వ్యవసాయ కేంద్రం కంప్యూటరీకరణ పనులతో పాటు సంఘం పరిధిలో జరిగిన లావాదేవీలపై విచారణ అధికారిగా సైతం రజనీకి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. అయితే విధి నిర్వహణలో శాంతిపురం విచ్చేసిన ఉద్యోగి స్థానిక సబ్ డివిషనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ అనుమతి తీసుకోలేదని, పలమనేరు నుండి కుప్పం వరకు ఉన్న సహకార సంస్థలలో నాకు తెలియకుండా ఎవరు ఎలాంటి పనులు, విచారణ చేపట్ట రాదని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారని ప్రశ్నిస్తూ దాడికి పాల్పడ్డట్టు తెలిసింది. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఉన్న పలు సహకార సంస్థలలో అవకతవకలు జరిగాయంటూ పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు సంస్థలకు సంబంధించి ప్రత్యేకవిచారణ అధికారులను నియమించి, ప్రభుత్వం విచారణ సైతం నిర్వహిస్తోంది. కంచె చేను మేసిన చందంగా సహకార శాఖ అధికారులే సంస్థలలో జరిగిన అవకతవకలకు తోడ్పాటు అందించడమే కాకుండా, పలుచోట్ల అధికారులే తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులతో కలిసి సంస్థలను వాడుకున్నారని, కొంతమంది అధికారులు రాజకీయ నాయకులకు తప్పుడు సలహాలు ఇస్తూ కోట్లాది రూపాయల సంస్థ నిధులు దుర్వినియోగం కావడానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం విచారణ కొనసాగితే అధికారుల అవినీతి వెలుగు చూస్తుందన్న భయంతోనే సదరు అధికారి ఉద్యోగులపై దాడులకు పాల్పడ్డట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. అయితే బాధితులు తమపై జరిగిన దాడులను వివరిస్తూ జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, వీటిపై అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా గత ఐదు సంవత్సరాల కాలంలో పలు సహకార సంఘాలలో, ప్రాథమిక వ్యవసాయ సంస్థలలో రాజకీయ నాయకుల అండదండలతో పెద్దఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని, వీటిపై అధికారులు సక్రమంగా విచారణ చేపడితే పలమనేరు, కుప్పం నియోజక వర్గాలలోని పలు ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలలో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తాయని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. సాటి ఉద్యోగులపై దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సహకార సంఘాలలో సరైన విచారణ చేపట్టి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరుతున్నారు.

అధికారి దాడిలో గాయపడిన ఉద్యోగి

వేరుశనగ రైతు విలవిల...!

- వర్షాలు లేక ఆందోళనలో రైతాంగం
- ప్రభుత్వం ఆదుకోవాలని ఆకాంక్ష

ప్రజాశక్తి - రామకుప్పం

నీరు లేక ఎండిన వేరుశనగ పంట

ఖరీఫ్ సీజన్లో భారీగా పంటలు పండుతాయన్న రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఏటేటా అతివృష్టి లేదా అనావృష్టి దెబ్బకు పంటలు చేతికి అందక అప్పులు మిగులుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతాంగం అల్లాడిపోతున్నారు. ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరుగుతుండటం, పంటలు చేతికి అందకపోవటం, కూలీల కొరత కారణంగా వేరుశనగ సాగు సైతం ప్రతి ఏటా తగ్గుతూ వస్తోంది. గత ఏడు రామకుప్పం మండల పరిధిలోని 1500 హెక్టార్ల వరకు వేరుశనగ పంటను రైతులు సాగు చేయగా ఈ ఏడు 700 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుఅవుతోంది. సీజన్ ప్రారంభంలో కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు వేశారు. ఆపై ఈ ప్రాంతంలో సరైన వర్షపాతం లేకపోవటంతో వేరుశనగ పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో దిక్కు తోచని పరిస్థితిలో రైతులు విలవిలాడుతున్నారు. దీనికి తోడు మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో అడవి జంతువులు పంటల పై పడి తిన్నంత తిని ధ్వంసం చేస్తున్నాయి. వర్షాలు కురవకపోతే అరకోరగా పండిన పంటలు సైతం చేళ్లలోనే వదులు కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా ద్వారా వేరుశనగ రైతులను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

ఉద్యాన శాఖ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు ఎంఐడిహెచ్, ఆర్‌కెవివై ద్వారా సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలను అందించి ప్రోత్సహించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని నూతన సమావేశపు మందిరంలో కలెక్టర్ ఉద్యాన శాఖ పోస్టర్‌లను జేసి జి.విద్యాధరి, ట్రైనింగ్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారి, ఏపిఎంఐపి పిడి మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, సిపిఓ సాంబ శివరెడ్డిలతో కలసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలైన ఎంఐడిహెచ్, రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన, ఆయిల్ పంప్ పథకాలలో రైతులకు ఆర్థికంగా సహాయం అందించే సబ్సిడీ వివరాలను వివరిస్తూ పోస్టర్లు విడుదలచేసినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్‌లో భాగంగా పండ్ల, పూల తోటల, కూరగాయల విస్తరణ పథకం, విదేశీ, సాంప్రదాయ విస్తరణ పథకాలకు 40 శాతం, ఫారం పాండ్ల ఏర్పాటుకు 50శాతం సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. దీనితో పాటు పాలీహౌస్‌లు, షెడ్‌నెట్ హౌస్‌లు, మల్చింగ్ ఏర్పాటుకు 50శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. ఫారం మెకనైజేషన్ కింద చిన్న ట్రాక్టర్‌లు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌల్డెడ్ స్ప్రేయర్లకు 45-50 శాతం సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. పండ్ల కోతల అనంతరం జరిగే నష్టాలను నివారించుకోవడానికి ఉపయోగకరమైన ప్యాక్ హౌస్ లను 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ పోస్టర్లు ప్రతి రైతు సేవా కేంద్రం, ఉద్యాన అధికారుల కార్యాలయం, అగ్రికల్చర్ అధికారి వారి కార్యాలయాలలో, ఎంపిడిఓ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులో ఉంచడం జరుగుతుందన్నారు.

కుప్పంలో టూరిజం అభివృద్ధి చేస్తాం : నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కుప్పం రూరల్:



కుప్పం నియోజకవర్గాన్ని ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని అనంతపురం సిసిఎఫ్ నాగేశ్వరరావు, చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. వీరు సోమవారం కుప్పం నియోజకవర్గ పరిధిలోని ననియాల అటవీ ప్రాంతం నుండి పెద్దవంక కనకనాచనమ్మ దేవాలయం వరకు పర్యటించారు. ఇందులో భాగంగా ననియాల ఎలిఫెంట్ క్యాంప్, ఎకో పార్క్, సోలార్ పవర్‌ప్లాంట్, నర్సరీలను పరిశీలించడంతో పాటు కనకనాచనమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ననియాల నుండి పెద్దవంక వరకు ఎకో టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్టు తెలిపారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం: ఎంపి

చిత్తూరు సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం: ఎమ్మెల్యే

చిత్తూరులో..

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తుండడం తమకు లభించిన గొప్ప వరమని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం నగర పరిధిలో 6వ వార్డు సాంబయ్య కండ్రిగ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మొదటగా నేషనల్ రోడ్డులో ఇంటింటికి వెళ్లి వందరోజుల్లో ఎన్డిఎ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి, ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో చిత్తూరు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మేయర్ ఎస్.అముద, మాజీ ఎమ్మెల్సీ బి.ఎన్.రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ మేయర్ కటారి హేమలత పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల పరిధిలోని కెఎం పురంలో సోమవారం జనసేన మండల బూత్ కన్వీనర్ మండి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పులిబెర్ల చంద్రమౌళిరెడ్డి, నాగభూషన్ రెడ్డి, చెంగల్ రాయలు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కార్వేటినగరంలో బిసి సంఘం అధ్యక్షులు రవి యాదవ్, రమేష్, వాసుదేవ రెడ్డి, జగన్నాథం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. సిడి కండ్రి, కోదండరావుపురంలో దాసరి గణేష్, శ్రీనివాసులు యాదవ్, చంద్రయ్య, కుప్పారెడ్డి, నడిపి రెడ్డి, నరేష్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

బంగారుపాళ్యం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ ఉష్మశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గౌరీ శంకర్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇది చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టులో..

పూతలపట్టు: ప్రస్తుత ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని ఆకులబండ్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రతి నిరుపేదకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. కన్వీనర్ దొరబాబు, మాజీ కన్వీనర్ చంద్రమౌళి అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: కూటమి ప్రభుత్వంలో వందరోజుల పాలన 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకున్నదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నారాయణపురం తండ, బండారువల్లి, చల్దిగానిపల్లి, గోవిందమాకులపల్లి గ్రామపంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించారు. రాజగోపాల్, మహమ్మద్ రఫీ, మునిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ అమర్నాథ్ నిర్వహించారు. గ్రామంలో సమస్యలను అర్జీ రూపంలో అందించిన వెనువెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, యోగేశ్వర్ నాయుడు, దాసరి సతీష్, జీవన్ కుమార్, వజ్జావేలు రెడ్డి, మునిరత్నం రెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని సంఘనపల్లి గ్రామపంచాయతీలో సోమవారం ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం ఎందుకు అనే పోస్టర్‌ను విడుదల చేశారు. పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్, యూనిట్ ఇంచార్జ్ బాబు, ప్రధాన కార్యదర్శి భాను, ఎంపిడిఓ, ఈఓపిఆర్‌డి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్ని తప్పక నెరవేరుస్తామని తెలిపారు. మాజీ ఎంపీపీ ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, రామకృష్ణ పాల్గొన్నారు. కోగిలేరులో ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ అంటించి గ్రామస్తులతో మాట్లాడడం జరిగింది. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ చిన్న రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చెంగారెడ్డి, శివన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

గుడిపల్లిలో..

ఆడపిల్లలను రక్షించుకుందాం

ఎంఇఓ 2 రమేష్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆడపిల్లలను రక్షించుకుందామని మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడపిల్లలను రక్షించుకుందాం కార్యక్రమం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 మాట్లాడుతూ ఆడపిల్లల పై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని వారిని కఠినంగా శిక్షించాలని, ఆడపిల్లలను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హేమ మొదటి స్థానాన్ని, రెండవ స్థానాన్ని బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని తానిషా, వక్తృత్వ పోటీల్లో బంగారుపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన నికిత మొదటి స్థానాన్ని, వైష్ణవి ద్వితీయ బహుమతి, చిత్రలేఖన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యామిని మొదటి బహుమతి సాధించి బహుమతులు గెలుచుకున్నారు. గెలుపు గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీకుమారి, రోజా, రమణి, సుమిత్రమ్మ, లలిత పాల్గొన్నారు.

మండల క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండల అండర్ 14, 17 క్రీడాపోటీలను మండల విద్యాశాఖ అధికారులు ఉమామహేశ్వరరావు, దామోదరం, వెదురుకుప్పం బిడిపి క్లస్టర్ ఇంచార్జి మోహన్‌మురళి ప్రారంభించారు. ఈ కార్యక్రమం వెదురుకుప్పం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మురళి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పిటి ఉష, కరణం మల్లేశ్వరి, ప్రమోద్, హార్పోన్ ప్రీత్ సింగ్ లాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలని అన్నారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, త్రిలోక సుందరి, గోవింద్ రెడ్డి, నాయక్ ధనలక్ష్మి మోహన్ మురళి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎక్స్ సర్వీస్మెన్ అసోసియేషన్ తరపున మృతుడు చంద్రశేఖర్‌రెడ్డికి రూ.1,12,111ల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. పలమనేరు రూరల్ మండలంలోని కొలమాసనపల్లి ఎన్.కొల్లాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి అగ్నివీర్ 21 సాట రెజిమెంట్‌లో పనిచేస్తూ సెలవుపై సొంత గ్రామానికి వచ్చాడు. కాగా రోడ్డుప్రమాదంలో మరణించాడు. దీంతో మృతుని కుటుంబానికి ఆర్థికసాయంగా రూ.1,12,111లను పలమనేరు ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్, అలాగే 21 సాటరెజిమెంట్ నుంచి సుబేదార్ వాసు నాయక్, సుబేదార్ సోమసుందర్ వారి యూనిట్ తరపున రూ.1,64,000లు చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంభీశ్వర స్వామి ఆలయ సమీపంలో పేద ప్రజలు కళ్యాణాలు జరుపుకునేందుకు నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ ధర్మకర్త బి.వి.సోమశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. వరదం శ్రీనివాసులు రూ.15,116లు, దొంగరి మనోహర్ రూ.10,116, మల్లిశెట్టి గారి మల్లికార్జున భార్య భారతమ్మ రూ.10,116, పచ్చి పులుసు పాండన్న భార్య నాగరాణి రూ.5,116, దాసరి ఎర్రప్పనాయుడు భార్య లక్ష్మీదేవి రూ.5,016లు, ఆదేపడిగాల రెడ్డి పార్థసారథి 15 మూటలు సిమెంటు బస్తాలు, హోటల్ గణేష్ పది మూటల సిమెంట్ అందజేశారని ధర్మకర్త తెలిపారు. దాతలు విరాళాలు ఇచ్చి కళ్యాణ మండపం నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ధర్మకర్త కోరారు. కార్యక్రమంలో లింగన్న, శంకర, ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్
రాష్ట్ర అధ్యక్షులుగా వినోద్ కుమార్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: అమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ఫౌండర్, శివగిరి ఇన్నా ఎండి వినోద్ కుమార్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా నియామకమైనట్లు మానవహక్కుల మండలి జాతీయ అధ్యక్షులు గోపాల్ దాస్ లాస్యరి తెలియజేస్తూ వినోద్ కుమార్‌కి నియామకపత్రం, గుర్తింపు కార్డును అందజేశారు. కౌన్సిల్ కోర్ గ్రూప్ కమిటీ సిఫారసు మేరకు వినోద్ కుమార్ సామజిక సేవ, సమాజం పట్ల ఆయనకున్న ప్రేమ, అంకితభావంను, నైపుణ్యత, నాయకత్వ నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకొని మానవ హక్కుల పరిరక్షణకు తనవంతుగా కృషి చేయగలరనే విశ్వాసంతో ఉన్నత స్థానంలో నియమిస్తున్నామని గోపాల్ దాస్ తెలిపారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ అధ్యక్ష పదవి తనకు రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

ఎస్పికి సన్మానం

ప్రజాశక్తి- విజయపురం: ఎస్‌పి బలరామును సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. శాంతి భద్రతకు న్యాయం చేకూరేలా సహాయ సహకారాలు అందించాలని ఎస్పిని కోరారు. సర్పంచులు విద్యా భాస్కర్ రెడ్డి, మమత, శ్రీరాములు, కుప్పయ్య, సురేష్ పాల్గొన్నారు.

తిరుమల అపచారంపై
బిసివై పార్టీ పాదయాత్ర

ప్రజాశక్తి - పుంగనూరు: తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలపడంతో అపచారం జరిగిందని పరిరక్షణ కోసం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్ర 27వ తేదీ శుక్రవారం పుంగనూరు నుంచి తిరుమలకు పరిరక్షణ పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్రను పుంగనూరు హనుమంతరాయదిన్నె ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి చౌడేపల్లి, సోమల, సదుం, కల్లూరు, పులిచెర్ల, రొంపిచర్ల క్రాస్, శ్రీనివాస మంగాపురం మీదుగా 30న అలిపిరి నుంచి తిరుమల మెట్లోత్సవంకు చేరుకుంటుందని తెలిపారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - విజయపురం: ఈనెల 25వ తేదీ బుధవారం నుంచి మండల స్థాయి క్రీడలు ఎంఈఓ హరిప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం జంబాడ ఉన్నత పాఠశాలలో క్రీడలు ప్రారంభం అవుతాయని, ఉదయం తొమ్మిది గంటలకు క్రీడలు ప్రారంభమవుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తోపాటు అథ్లెటిక్స్ క్రీడలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రసాద్‌కు ఘనసన్మానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం హైస్కూల్లో కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో 164వ సంగీత నృత్య పోటీలు ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ నృత్య పోటీ ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పచ్చి కాపల్లంలో ఆయన శ్రీలక్ష్మి బ్రాంజెస్ అధినేత ప్రసాద్ రూ.10 వేల విలువ చేసే బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతోపాటు ఆటలపోటీలలో కూడా రాణించడం అభినందనీయమన్నారు. ప్రతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా త్యాగరాజు

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరం మండలం డిప్యూటీ తహశీల్దార్‌గా ఎం.త్యాగరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. త్యాగరాజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి బదిలీపై కార్వేటినగరం తహశీల్దార్ కార్యాలయంకు డిప్యూటీ తహశీల్దార్‌గా రావడం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

'లడ్డూ నాణ్యత గోవింద'

జనసేన దీక్షలు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ కల్తీపై చోటు చేసుకున్న వివాదంపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గాంధీ విగ్రహం ఎదుట జనసేన నాయకులు దీక్షలకు పూనుకున్నారు. వీరి దీక్షలకు తెలుగుదేశం, బిజెపి నాయకులు మద్దతు ప్రకటించారు. గత ప్రభుత్వం అత్యంత పవిత్రమైన తిరుమల లడ్డూను అపవిత్రం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఎంఎల్ఏ గురజాల జగన్‌మోహన్ కోరారు.

దీక్షలో మద్దతు తెలిపిన ఎమ్మెల్యే గురజాల

'ఆపన్న హస్తం అందించండి'

ప్రజాశక్తి - ఐరాల: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం.. భర్త పుట్టు వికలాంగుడు.. చేతికొచ్చిన బిడ్డలు ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు.. ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ ఆ కుటుంబానికి అన్నీ తానై కూలీ పనులు చేసుకుని కుటుంబ భారం మోసింది ఆ తల్లి.. నేడు క్యాన్సర్ భారినపడి రోజులు లెక్కపెడుతోంది.. పేదలకు ఖరీదైన వైద్యం చేయించుకోవాలంటే ఎం చెయ్యాలో తెలియక తిరుపతి లోని టాటా క్యాన్సర్ ఆసుపత్రిలో అచేతనంగా పడి చికిత్స పొందుతున్న ఒక మహిళ దీనగాథ.. ఐరాల మండలం పొలకల పంచాయతీ పొలకలరెడ్డి వారిపల్లి దళితవాడలో రజని(37), మునిరాజ అనే దంపతులు నివసిస్తున్నారు. రజని భర్త మునిరాజ పుట్టినప్పటి నుండి మూగ, చెవుడు సమస్య ఉంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మోహన్ డిగ్రీ మొదటి సంవత్సరం తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్నాడు. రెండవ కుమారుడు వంశీ ఐరాల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కూలీ పనులు చేసుకుని ఈ కుటుంబం జీవించేది. ఈ నేపథ్యంలో రజని క్యాన్సర్ వ్యాధితో భాధపడుతూ రోజులు లెక్క పెడుతోంది. తనకు వచ్చిన జబ్బుకు వైద్యం చేయించుకోలేక కుటుంబ పోషణ, పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోయాయని ఆవేదన చెందుతున్నారు. వీరి కష్టాన్ని చూసి చలించిన గ్రామస్తులు తమకు తోచిన సాయం అందించి వైద్యులురాల ఆపరమైన సాయం చేసి సహకరిస్తున్నారు. అలాగే మనసున్న దాతలు ఈ కుటుంబాన్ని ఆదుకుని మరింత ధైర్యాన్ని ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. సహాయం చేసే దాతలు ఎవరైనా సి.రజని, అకౌంట్ నెంబరు - 34751850188 ఎస్‌బిఐ పొలకల బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సి ఎస్‌బిఐఎన్0006515 లేదా 95738 29003 నంబర్‌కు ఫోన్ పే ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజని

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మధ్యప్రదేశ్‌కు చెందిన 10 మంది వ్యవసాయ పరిశీలకుల బృందం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులు, వివిధ రకాల పంట పొలాలను పరిశీలించారు. సోమవారం మండలంలోని తెల్లగుండ్లపల్లి గ్రామంలోని రైతు హనుమంతురెడ్డి పొలంలో బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, ఘన జీవామృతంలో రెండవ పద్ధతి, నీమాస్త్రం, కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం, పుల్లటి మజ్జిగ మొదలైన కషాయాలు, ద్రావణాలు తయారు చేసే విధానం చూపించారు. కూరగాయలు ఎంటిపిఎ మోడల్‌లో 18 రకాల మొక్కలు కూరగాయల మోడల్ విధానాన్ని పరిశీలించి వాటి ఉపయోగాలు రైతు హనుమంతును అడిగి పొలంలో పాటిస్తున్న పద్ధతుల గురించి తెలుసుకున్నారు. వేరుశనగ ఎ గ్రేడ్, మామిడిలో పీఎండీఎస్, సూర్యమండలం మోడల్, డ్రాప్ ఫ్రూటింగ్ చిత్తూరు మోడల్ ఉపయోగాలు గురించి తెలియజేశారు. వీటికి ప్రతి 15 రోజులకు ఒకసారి ఘన, ద్రవ జీవామృతాలు కషాయాలు ద్రావణాలు ఉపయోగించి పూర్తిగా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నామని రైతు హనుమంతు తెలియజేశారు. ఇందులో భూమిని, సూర్య రశ్మిని సమర్థవంతంగా వినియోగించుకోవడం జరుగుతున్నదని, రసాయన వ్యవసాయ పద్ధతులలో 5 ఎకరాలలో పండించే పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో 1 ఎకరాలోనే పండించి అధిక ఆదాయం పొందుతున్నానని, వరి పంటలలో దేశీ రకాలైన నవారా, మైసూరు మల్లిగా, దూదేశ్వర్ లాంటి వరి పంటలను కూడా పండించామని తెలియజేశారు. వీరి పొలం అంతా బాగా ఉండటం ఈ పద్ధతులు బాగా ఉన్నాయని, దేశీయంలో పుంగనూరు ఆవులు, దూడను చూసి చాలా ఆనందం వ్యక్తం చేశారు.

రైతు పొలంలోని పంటను పరిశీలిస్తున్న బృందం

కార్యక్రమంలో రాష్ట్ర రాస్ ఎన్ఆర్‌టి టీమ్ లీడ్ హనుమాయన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు, గురుప్రసాద్ ఎన్ఎఫ్ఎం, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, రాష్ట్రస్థాయి అధికారి కల్పన, ట్రైనర్ నాంచారమ్మ, ఇండియన్ బ్యాంక్ దేవలంపేట బ్రాంచ్ మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి పొందవచ్చు అని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు అన్నారు. సోమవారం మండలంలోని మంగుంట గ్రామపంచాయతీ మంగుంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు శేషాద్రి రూప్సి వ్యవసాయ పొలంలో మధ్యప్రదేశ్ బృందం ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు పండించే పంటలను తిరుపతి తిరుమల దేవస్థానం నేరుగా రైతు వద్ద తీసుకుంటారని తెలిపారు. మధ్యప్రదేశ్ నుండి వచ్చిన శాస్త్రవేత్తలు ఆర్ఎం సింగ్, వివేక్ మోర్, హరేందర్ సింగ్, రాంజీసింగ్, రాష్ట్ర ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ముక్కంటి'..నీ పరిస్థితేంటి..?

నెయ్యి నాణ్యత నామమాత్రం
పరిశీలించకనే గోదాముల్లోకి..
ఎంఎల్ఏ స్థాయిలోనే విమర్శలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: తిరుమల శ్రీవారి ప్రసాదాలు కల్తీ నెయ్యితో తయారు చేశారనే వివాదం బయటకు రావడంతో రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ప్రసాదాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రసాదాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. రెండు కంపెనీలకు చెందిన నెయ్యిని కాంట్రాక్టర్ ఎంతోకాలంగా సరఫరా చేస్తున్నారు. ఆయితే లడ్డు తయారీ కేంద్రానికి వెళ్లినా, తిన్నా నెయ్యి వాసన మాత్రం రావడం లేదన్న ఆరోపణ గత కొన్నేళ్లుగా ఉంది. దీనిపై భక్తులు ఎప్పటి నుంచో పెదవి విరుస్తున్నారు. అటు నాయకులు, ఇటు అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆలయంలోని అన్ని విభాగాలను సమీక్షించి రివ్యూ ఆలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సరుకులు, అన్నదానం, ప్రసాదాల తయారీ పై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లేని సరుకులు వస్తున్నాయని ప్రకటించారు. ఆ వెంటనే నాణ్యతలో మార్పులు తెస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటివరకు అమలు కాని పరిస్థితి నెలకొంది.

నెలకు 8 టన్నుల నెయ్యి వాడకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాల తయారీకి నెలకు ఎనిమిది టన్నుల నెయ్యిని వాడుతున్నట్లుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నెయ్యి వాడకం మరింత ఎక్కువగా ఉంటుంది. ఎప్పటినుంచో సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే నెయ్యి నాణ్యత పై ఆలయ అధికారులు నుంచి పాలకమండలి వరకు ఎవ్వరూ దాని పరిశీలించి నివేదిక ఇచ్చే పరిస్థితి లేదు. ఆలయానికి సరుకులు వచ్చిన సందర్భంగా వాటిని పరిశీలించాల్సిన బంధం ఆలయంలో లేదు. పరీక్ష కేంద్రాలు అసలే లేవు. బియ్యం, ఉప్పు, పప్పులు, శనగపిండి, చక్కెర, నెయ్యి, కొబ్బరికాయలు ఏవైనా వాటిని పరిశీలించిన తర్వాత గోదాముకు చేర్చాలి. అయితే అటువంటి తతంగం ఏదీ లేదు. విజిలెన్స్ విభాగం కూడా లేదు. కాంట్రాక్టర్ ఎటువంటి వస్తువు సరఫరా చేస్తున్నా అడిగే నాథుడు కూడా లేడు. ఆలయానికి వచ్చిన సరుకుల ఏవీ తిరిగి వెళ్లిన సందర్భాలు లేవు. అంటే కాంట్రాక్టర్లు ఏది సరఫరా చేసినా అధికారులు, సిబ్బంది అన్నింటికీ తలూపి బిల్లులను మంజూరు చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థల పేరుతో (బినామీ పేరుతో) సరఫరా చేస్తున్నట్లు సమాచారం. గత పాలకులు, అధికారులు ప్రశ్నించిన పాపాన పోలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి. తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యిలో ఆవు, పంది, చేపల అవశేషాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని చెబుతున్న నేపథ్యంలో శ్రీకాళహస్తి దేవస్థానానికి సరఫరా అయ్యే నెయ్యిలో ఎటువంటి అవశేషాలున్నాయో బయట పడాలంటే నిష్పక్షికంగా విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా నాయకులు, అధికారులు వ్యవహరించాలి. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సైతం ముక్కంటి ప్రసాదాల్లో వాడే నెయ్యి నాణ్యతపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేవలం కమిషన్లకు కక్కుర్తి పడి నాణ్యతలేని ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ముక్కంటి నెయ్యిపైనా విచారణ జరపాలి : ఎస్సీవీ

దేవుడు సొమ్ము ఎవరు తిన్నా వినాశనం తప్పదని, అందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఈ గతి పట్టిందంటూ శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఘాటు విమర్శలు చేశారు. ఎస్సీవీ తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ముక్కంటి ప్రసాదాల్లోను కల్తీ నెయ్యి వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కల్తీ గుట్టు విప్పేలా అన్ని ఆలయాలకు అనుబంధంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

నకిలీ కంపెనీ ద్వారా సరఫరా : బొజ్జల సుధీర్‌రెడ్డి

తిరుమల తరహాలోనే శ్రీకాళహస్తి ముక్కంటి ప్రసాదం తయారీలోనూ కల్తీ నెయ్యి వాడారన్న అనుమానం ఉంది. ఆలయ పరిపాలన భవనంలో మాట్లాడుతూ గత పాలకులు నకిలీ నెయ్యి సరఫరా అవుతున్నట్లు చెప్పారు. తాను ఎంఎల్ఏ వైష్ణవి డెయిరీ నుంచి ముక్కంటి ఆలయానికి నెయ్యి సరఫరా అవుతున్నారు. ఆయన తరువాత ఆస్తిన వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి దిగుమతి చేసుకున్నట్లు చెప్పారు. ఇకపై ముక్కంటి ఆలయానికి వచ్చే నెయ్యి, సరుకులను నాణ్యతపై విజిలెన్స్ కమిటీతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు.

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉచిత డిఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఎల్ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక పిసిఆర్ జూనియర్ కళాశాలలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ చిత్తూరు శాఖవారి ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రచురించిన టెట్ డీఎస్సీ ఉర్దూ స్టడీ మెటీరియల్ ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం 16వేల పైచిలుకు డీఎస్సీ ఉద్యోగాలను ప్రకటించనున్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం ప్రచురించిన ఈ స్టడీ మెటీరియల్ బాగా చదివి డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు సయ్యద్ మూలా, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ - ఉన్ - నబీ వేడుకలు

ప్రజాశక్తి - వి.కోట: మండలంలోని కృష్ణాపురం సమీపంలోని సయ్యద్ అలీపీరాన్ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్ట్‌లో సోమవారం మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మిలాద్ - ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదరసా ట్రస్ట్ దారుల్ ఉలూమ్ అహ్లె సున్నత్ హజ్రత్ సయ్యద్ అలీ పీరాన్ షా ఖాదరి మక్కీ వారి 18 సంవత్సరం జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రవక్త పుట్టిన రోజు వేడుకలను హజ్రత్ ముఫ్తీ జమాలుద్దీన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవక్తకు చెందిన అనాటి చిహ్నాలు భక్తుల ప్రదర్శన కోసం ఉంచారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది హిందూ సోదరులు సైతం పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు వైద్యవేద్యం స్థానిక అర్బన్ సిఐ సోమశేఖర్ రెడ్డి, ఎస్ఐ బాబు బృందాన్ని ట్రస్టు వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సయ్యద్ అలీ పీరాన్ షా, హజ్రత్ హమీదుల్లా సాహెబ్, మౌలానా ముజాహిద్ సాహెబ్, నియామత్ సాహెబ్, మౌలానా సలీముద్దీన్, సయ్యద్ ఇస్మాయిల్ (వేలూరు) మహ్మద్ అలీ పాల్గొన్నారు.

నేడు, రేపు మండలంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- సోమల: మండలంలోని కందూరు పంచాయతీ మిట్టపల్లి, పల్లిగట్టు పరిధిలోని కామిరెడ్డివారిపల్లి గ్రామాల్లో నేడు, రేపు పొలం పిలుస్తోంది గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి మంగళ, బుధవారాలలో మండలంలోని రెండు గ్రామాలు ఎంపిక చేసి ఆ గ్రామాలలో రైతులకు ప్రజలకు వ్యవసాయశాఖ తరఫున జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు రైతులకు సలహాలు సూచనలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఉద్యానవన శాఖ, పశు సంవర్థక శాఖ, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు నూతన సాంకేతిక పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభలలో ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి 'పొలంబడి'

విజయపురం: ఈనెల 24వ తేదీ మంగళవారం పొలంబడి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఏవో రజని కుమారి తెలిపారు. పంట పొలంలో సాగు విధానంతో పాటు ఎరువులు, పురుగు మందులు వాడకంతో పాటు తక్కువ పెట్టుబడితో దిగుబడి సాధించే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

వెంగళపల్లిలో 'పొలంబడి'

వెదురుకుప్పం: మండలంలోని కొప్పెడులోని వెంగళపల్లిలో సోమవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు పురుగులు, తెగుళ్లు నివారణ, మిత్రపురుగులు, శత్రు పురుగులు గురించి ఏడీఏ ఉమామహేశ్వరి తెలియజేశారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేసుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ హనుమంతు, వ్యవసాయ శాఖ సిబ్బంది మురళి, దయాకర్, ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేని టపాసులు సీజ్

ప్రజాశక్తి - సోమల:

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామానికి చెందిన వెంకట రామయ్య శెట్టి వద్ద అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన రూ. 2.50,000ల విలువైన టపాసులను గోడౌన్‌లో ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మికంగా నిల్వ ఉంచిన టపాసుల గోడౌన్ల పై దాడులు చేసి సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. తాత్కాలిక లైసెన్స్ కలిగిన టపాసుల విక్రయదారులు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించి నడుచుకోవాలని కోరారు.

గిన్నిస్ బుక్‌లోకి సునందకు చోటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

క్రోషెట్స్ తయారీలో సునందకు గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కింది. విశాఖపట్టణం చెందిన మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రోషెట్ తయారీలో ఈ అవకాశం లభించింది. సునంద పుత్తూరు పట్టణానికి చెందిన బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత సీనియర్ మేనేజర్ జి.సుబ్రమణ్యం రాజు కుమార్తె. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకూ మొత్తం 450 మంది చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులతో కలిపి అతి తక్కువ సమయంలో 58,112 క్రోషెట్ స్క్వేర్లను తయారు చేశారు. నగరంలో వెంకోజీపాలెం చందన మోహనరావు ఫంక్షన్‌హాల్లో వీటిని ప్రదర్శించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ పరిశీలించి లార్జెస్ట్ డిస్ప్లే ఆఫ్ క్రోషెట్ స్క్వేర్ గా గిన్నిస్ రికార్డును దవీకరించారు.